# సౌభాగ్యవతి

'ఇంతకూ మా లక్ష్మినర్సు అదృష్టజాతకురాలు' అంటూ కన్యానిశ్చయంనాడు తనకాళ్లకు దండం పెట్టిన మనుమరాలి ముఖాన్ని రెండు చేతులా తీసుకుని ముద్దుపెట్టుకుంటూ నాయనమ్మ శేషమ్మ మురిసిపోయింది.

ఈ మాట విన్న శేషమ్మగారి ఆడపడచు వేంకటలక్ష్మి -

'వదినా! వూరికే పోతుందా? ఈ పేరు మహిమ, కస్తూరి వాసనలా చుట్టూ పది గ్రామాలను వాసింపచేసింది ఆ పేరు. ఆపేరు తాలూకు మంచివల్లే ఈ పాపిష్టి రోజుల్లో కూడా జనం ఇంకా మీ భవంతి వైపు తిరిగి దణ్ణం పెట్టుకుంటున్నారు. మరి అలాంటి పేరుమోసిన నరసింగరాయని ముద్దుల మనవరాలాయె. అదృష్టం వచ్చి వరించక ఏం చేస్తుంది' అంటూ అన్నగారిని వెనకేసుకు వచ్చి గొప్పలు ఏకరువు పెట్టింది వేంకటలక్ష్మి.

'అమ్మా! వేంకటలక్ష్మి! నీవన్నట్టు మీ అన్నగారి పేరుప్రతిష్ఠల మహత్తును ఎవరూ కాదనలేదు. ఆ పేరు ప్రభావమే ఈ యింటికి ఉపజీవ్యంగా మారింది. నిజమే! అయినా ఆ పేరును చిన్నదానికి పెట్టింది ఎవరంట? ఆ ఘనతను ప్రశంసిస్తూ పెద్దపీట వేయాల్సివస్తే ఎవరికి వేస్తావూ ? అని!

'అబ్బా! వదినా! ఆ విషయాన్ని నేనెలా మర్చిపోతాను ? కానీ ప్రస్తుత విషయం అది కాదే? ఇప్పుడు నేను అంటున్నదల్లా చిన్నదాని పేరులో సాక్షాత్తు అన్నయ్యగారు 'సజీవులై ప్రభావాన్ని ప్రదర్శిస్తున్నారని మాత్రమే!'

'వేంకటలక్ష్మి చలాకీగా మాటను దారి మళ్లించకు. నేనంటున్నది కూడా ఆ పేరును సూచిస్తూ పిల్లదానికి నామకరణం చేసిన వివేకం ఎవరిదీ అని?'

'శేషమ్మ వదినా! ఇన్నేళ్లు పైబడ్డా పట్టుదల మాత్రం చింతాకంత సడలలేదు కదా' అని అంటున్న వేంకటలక్ష్మి మాటను సాగనివ్వకండా అడ్డం వస్తూ శ్రీమతి అంటే లక్ష్మినర్సు తల్లి --

'అక్కగారూ! మన వదినెగారి బుద్ధి పాదరసం లాంటిది. ఎప్పుడూ చాకులా కొత్తకొత్త మెరుపులతో నిగనిగలాడుతుందే తప్ప మందకొడిగా వుండదు. ఏదేమైనా మా అమ్మాయికి అన్నయ్యగారి పేరు జోడించి 'లక్ష్మీనర్సు'గా నిలిపింది వారే'

'అక్కగారు వియ్యపురాలిని వెనకేసుకొస్తున్నారు'...

'లేదమ్మ! వాస్తవాలను కాదంటే ఎలా? మా లక్ష్మి పుట్టగానే జాతకం చూసి ఇది మహాభాగ్యశాలి. దీనికి మహాలక్ష్మి యోగం వుంది అంటూ చెబితే మేం 'లక్ష్మిప్రసన్న' అంటూ బారసాలనాడు నామకరణం చేశాం. అది విని అక్కడే వున్న వదినెగారు నొచ్చుకున్నారేమో, వెంటనే నన్ను వుద్దేశిస్తూ అదేమిటండి? వింధ్యపర్వతంలాంటి తాతగారి పేరు స్ఫురించలేదా? లాంఛనప్రాయానికైనా ఆ పేరు 'కూ' అంటూ ఉచ్చరించలేదు. అంతటివారిని ఎలా మరిచారు? తొలిసంతానం దేవతల పేర్లు ఎలా తప్పవు. దేవతలాంటి తాతగారి పేరు ఎలా మరిచారు! నేను ఇంకా జీవించివున్నానని కూడా మరిచారా?

మా వాడంటే పాపం పెళ్లాం కొంగు చాటు మొగుడాయె; వాడికి తెలియకపోయినా పెద్దలు మీకైనా తెలియవద్దా? అంటూ నిలదీసే వరకు మా వారికి హడలెత్తి నిజమైన దోషిలా ఎదుటనిలిచి క్షమించుమంటూ కాళ్లా వేళ్లా పడినంత పని చేశారు. వదినెగారు కూడా గొప్పమనస్సుతో నిప్పుమీద నీళ్లు చల్లినట్లు శాంతించి ముసిముసి నవ్వులతో ముందుకు వచ్చి చిన్నదానికి 'లక్ష్మీనర్సమ్మ' అంటూ నామకరణం చేశారు'. అంటూ వివరించింది.

'అబ్బ! అప్పుడు చూడాల్సింది మీ వదినెగారి ఆనందం! చిన్నదాన్ని వొళ్లోకి తీసుకుని ముద్దులు గుమ్మరిస్తూ అచ్చంగా అన్నగారి స్పర్శనూ, అనునయ సౌఖ్యాన్ని అనుభవించినంతటి హాయితో గుండెలకు హత్తుకున్నారు' అంటూ పరాచికాలాడింది వరసకలిసిన ఆడపడుచు.

'అయితే! ఇదంతా నాయనమ్మగారి చలవే అంటారు.'

'అది కాదండీ! ఎంత నాయనమ్మ ప్రమేయం వున్నా అందరికీ నీడనిచ్చే మహావటవృక్షంలాంటి ఆ పేరు చాలదూ! దాని మహిమే ఈ సౌభాగ్యం అంతటికి కారణం' అంటూ అన్నగారి అభిమానాన్ని ప్రకటించింది వేంకటలక్ష్మి.

' ఏ మహిమైతేనేం? ఎవరి చలువైతేనేం? కావలసింది పిల్ల అదృష్టం. అది బాగుండబట్టే మన్మథుడు లాంటి రూపసి మొగుడు కాబోతున్నాడు' అంటూ వో ముత్తైదువ తీర్పు యిచ్చింది.

ఈ తీర్పుకు సవరణలు సూచిస్తూ శేషమ్మగారి చెల్లెలు పేరిందేవి -

' ఉత్తమ వరుడంటే? ఉత్తమ రూపం మాత్రమే కాదండోయ్. అన్నీ ఉండాలి. వెనకా ముందూ, లగువూ బిగువూ, చదువూ సంస్కారం లేని రూపంతో ఏం లాభం? కడుక్కుతాగనా? కొరుక్కు తిననా? చూపుడు గుర్రాల్లా ఎందరు కుర్రాళ్లు లేరు. చెల్లని

రూపాయిల్లా ? ఉత్త దండుగ! ఈ సంబంధం మాత్రం అలాంటిది కాదు. వారిది గట్టి పునాదులపై నిలిచిన భవంతి. పది నాగళ్ల వ్యవసాయం, ఇరవై వేల దఫ్తరం, పాడీపంట పుష్కలం.'

'అయ్యో! మరి ఇంత భారీ సంసారాన్ని చిన్నది ఒక్కర్తే ఎలా నిర్వహిస్తుంది?' అంటూ ప్రశ్నించిన వెంకాయమ్మ ప్రశ్నకు సమాధానంగా

'అలాంటి బరువూ బాధ్యతలు కూడా ఎక్కువగా లేవు. బయటి వ్యవహారమంతా చూడడానికి వ్యవహార దక్షులైన మామగారూ, బావగారూ వున్నారు. ఇల్లు తీర్చడానికి అత్తగారు వున్నారు. తోడుగా చదువుకున్న ఆడపడుచూ, గుణవంతురాలైన తోటికోడలూ వున్నారు. ఆ యింట్లో వెలితి అంటూ వెతికినా కనపడదు' అంటూ వందిమాగధుల్లా ఆ యింటిల్లిపాది అందరూ అలుపూ సొలుపూ లేకండా వచ్చిన వారి చెవులు నిండించారు.

ఆ టేపురికార్డు పాట అంత విన్న ఆడవారు అయాచితంగా దక్కిన ఆ పిల్ల సౌభాగ్యానికి లోలోపల ఈర్ష్యతో కుళ్లినా, పైకి మాత్రం కళ్లింతలు చేసి ' ఎలాగైనా చిన్నది పెట్టిపుట్టిన జన్మ, ఆ ఫలం అందరికి దక్కుతుందా? ఎంతనోముకు అంత ఫలం. ఓహో! ఏం సంబంధం? ఆహా! నలుగురు మెచ్చే సంబంధం!' అంటూ లేని సంతోషాన్ని వలకబోస్తూ తాంబూలాలు స్వీకరించి గలగలా వెళ్లిపోయారు.

నిశ్చితార్థం జరిగి నాలుగు నెలలు తిరక్కుండానే మాఘమాసంలో లక్ష్మీనర్సుకు వేంకటేశ్వర్రాయుడికి రంగరంగ వైభోగంగా పెళ్లి జరిగింది. పెళ్లిపందిట్లో నవదంపతులను చూచిన వాళ్లందరూ రతీమన్మదుల్లా వున్నారంటూ నిజంగానే మెచ్చుకున్నారు.

పెళ్లికి ఎదిగిన కన్నెపిల్లలు తమకూ యిలాంటి అందగాడు మొగుడైతే! అంటూ ఏవేవో తీయటి కోరికల తీవెలను పచ్చటి పందిళ్లకు పాకించుకున్నారు.

ఆనాడు ఎవరిని పలుకరించినా తొందరపాటే! ఏ పిల్ల చెంపలు చూచినా కెంపులే మెరిశాయి.

రెండు శరీర ప్రాణాలను కలిపి ఒక్కచోట బ్రహ్మముడితో బంధించినట్లున్న దంపతులు పైపంచెలను సవరించుకుంటూ మెడలో కళ్యాణమాల ధరించి పక్కపక్కగా నడుస్తున్న భర్త శరీర స్పర్శతో పులకించిన మధురోహల సందడికి చిగిర్చిన కోరికల పొంగుతో, బరువెక్కి పొగరు చూపే కళ్లు మరింత సొగసులు గుమ్మరిస్తూ వుంటే మన్మథసామ్రాజ్య పట్టభద్రవలె లక్ష్మీనరసు హంస నడకలతో భర్త అడుగులో అడుగు వేస్తూ సుతారంగా ఆయన చిటికెన వ్రేలును పట్టుకుని పెద్దవారి ఆశీస్సులకోసం కళ్యాణ మండపం వదిలి ముందుకు సాగిపోయింది.

విందూ వేడుకలతో మూడునాళ్ల సంబరం ముగిసింది. శోభనపు శుభఘడియలు సమీపించాయి. సుముహూర్తం చూసి శాస్త్రోక్తంగా గర్భాదానపు తతంగం బంధువులంతా

నడిపించారు. చీకటి పడే కొర్ది యింట్లో సిగ్గుల సింగారాలు ముసిముసి నవ్వుల దొంతరలు అలంకరణలు అధికమయ్యాయి.

కలిగిన సంసారం, కొదవేముందీ? పడకగదిలో శోభనపు శృంగారాలు ప్రారంభమయ్యాయి. మఖమలు దిండ్లమర్చిన గిలకల మంచానికి ఇరువైపులా నిలువెత్తు శమ్మెల్లో ఆముదపు దీపాలు వెలిగించి ఉంచారు. శోభనపు గది యావత్తు అత్తరూ, అగరువత్తులూ, మల్లెపువ్వుల వాసనలతో గుభాళించి పోతూ వుంది. పక్కనే చిన్న టీపాయిపైన పాలూ, పండ్లూ, మంచిగంధం ఫలహారాలూ తమలపాకు మడతలూ అమర్చి వున్నాయి. వెండి చెంబులో మంచినీళ్లూ, గ్లాసులూ పెట్టారంటూ వేరుగా చెప్పవలసిన పనిలేదు కదా!

దాదాపు రాత్రి తొమ్మిది కావస్తూంది. వేంకటేశ్వర్రాయుడు సిల్కు లాల్చీ, సిల్కు ధోవతితో వచ్చి మంచం మీద కూర్చున్నాడు. ఏదో పాట వింటూ! ఎందుకో? పిల్లవాడు ముచ్చెమటలు పోస్తున్నాడు. ఎదుట వున్న పాలగ్లాసు అందుకుని గటగట తాగుతూ ఏదో స్మృతి పథంలో మెదలగానే ఆ గ్లాసు కింద వుంచాడు బెదురు చూపులు చూస్తూ.

ఇంతలోకే ద్వారం తెరచుకుని పరిమళాలన్నీ ఒక్క బిగిన వచ్చి పడకపై వున్న మగరాయుణ్ణే వుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఆ సుగంధలహరి వెంటనే చెలులు గోలపెట్టి నెట్టగా సిగ్గుతెరల సాహాయ్యంతో ఘల్లుఘల్లున నడుస్తూ నర్సు గదిలోకి ప్రవేశించింది. మెరుపులాంటి ఆమెను చూడగానే ఒక్కసారి వెంకట్రాయడి శరీరంలో విద్యుత్తరంగం ప్రవహించింది. ఆ తాకిడి ప్రభావంతో ప్రాణవంతమైన పురుషత్వం ప్రేరేపించగా 'నర్సా' రా! రమ్మంటూ మంచంపైకి తీసుకున్నాడు. నర్సు గంధర్వలోకాలను తాకుతూ వుంది. అది పరమ సౌఖ్యపు సుఖలీలగా భాసిస్తూ వుంటే నర్సు పరవశించింది.

ఇంతలోకే వెంకట్రాయుడికి వుద్వేగం అంతా చల్లారగా మనస్సులో, భయం ఆవరించింది. జేబులో నుండి రుమాలు తీసి నుదుటిని వొత్తుకుంటున్నాడు. ఈ రెండు నిమిషాల వ్యవధిలో, కల నీరైన నర్సు వాస్తవ లోకంలో ప్రవేశిస్తూ సిగ్గును ఛీ అంటూ ఆవలికి తోసి ' ఏవండీ? ఏం జరిగింది' అంటూ ఆత్రంగా ప్రశ్నమీద ప్రశ్న గుమ్మరిస్తూ వుంది.

అవతల వెంకట్రాయుడి తల్లి, శోభనపు గదినుండి తన గదికీ తన గదినుండి యిక్కడికీ పిల్లిలా చేతులు పిసుక్కుంటూ పచార్లు చేస్తూనే వుంది. చివరికి ఆమె ప్రమాదం పసిగట్టి చొరవ చేసుకుని గదిలోకి ప్రవేశిస్తూ -

'అమ్మాయ్! ఏం భయపడకు, అబ్బాయికి కడుపులో నొప్పివచ్చినట్లుంది. వెంకటా! రా! నా గదిలో పడుకుందువుగాని' అంటూ పిలిచింది. నీటిలో మునిగిపోయే వాడికి ఏదో జీలుగుబెండు ఆసరా దొరికినట్లు తల్లి ప్రవేశాన్ని పదివేలుగా భావిస్తూ మారుమాటైనా పలక్కుండా గది విడిచి తల్లివెంట వెళ్లిపోయాడు మన్మథమన్మథుడైన వెంకట్రాయుడు.

అత్తగారి వెంటవెళ్లిపోయిన భర్త వార్త ఏమాత్రం తెలియలేదు నర్సుకు. ఒక్కొక్క నిమిషం వో యుగంగా గడుస్తూంది. కడపదాటి వెళ్లడానికి సాహసించడం లేదు. డాక్టర్లు వచ్చిన జాడా కనిపించలేదు. మందూమాకు అంటూ హడావిడీ లేదు.

'ఏమో? భర్త ఎంత బాధపడుతున్నాడో? స్పృహనే కోల్పోయారేమో? స్పృహలో వుంటే నన్ను విడిచి వుండగలరా? నన్ను రమ్మంటూ కబురు పెట్టరా? అబ్బ! ఎంత తీయగా పిలిచారు. ఈ కడుపు నొప్పికి కారణం? ఇది పాతదేనా? కాక ఆహారదోషం వల్ల వచ్చిందా? అంటూ పరిపరివిధాల పయనించే మనస్సును అదుపు చేస్తూ వచ్చే దుఃఖాన్ని మింగుకుంటూ ప్రయత్నపూర్వకంగా ఎవరైనా వస్తే బాగుండును' అంటూ అడుగుల అలికిడికోసం ఎదురుతెన్నులు చూస్తూ దిండులో ముఖాన్ని దాచుకుని పడుకుంది కొత్త పెళ్లికూతురు.

తెల్లవారింది. ఎన్నాళ్లనుండో ఆ యింట్లో ఇంటి మనిషిగా మెదుల్తూ వున్న పని మనిషి వచ్చి 'అమ్మాయిగారు ! లెండి మొకం కడుక్కుందురుగాని, అని అంటుంటే దీనంగా వున్న దాని ముఖానికేసి చూస్తూ సిగ్గూ, భయం, దుఃఖం మూడూ ముప్పిరుల్లా పెనవేసుకోగా రుద్ధమైన కంఠంతో 'మీ చిన్నయ్యగారెలా వున్నారవ్వా?' అంటూ ప్రశ్నించింది. నర్సు. ఆత్రంగా సమాధానం కోసం ఎదురుచూస్తూ..

'ఆఁ బాగానే వున్నారమ్మ. కాస్త నలతగా వున్నారు. రాత్రంతా నొప్పితో బాధపడ్తూనే వున్నారు. కొత్త పెళ్లికూతురివి, బెదిరిపోతావని నిన్ను తీసుకెళ్లలేదు. అంతే! లేమ్మా! కాఫీ తాగుదువుగాని' అంటూ ఆప్యాయంగా పిలిచింది. వెంట తీసుకువెళ్లింది.

లక్ష్మీనర్సు స్నానం చేసి తల దువ్వుకుని, తగుపాటిగా అలంకరించుకుని హాల్లోకి వచ్చింది. అక్కడ అందరూ వదినా! అమ్మాయీ, చెల్లీ, అంటూ అభిమానంతో సాదరంగా ఆహ్వానించారు.

అత్తకు మాత్రం కోడలిని పలకరించే ధైర్యం రాలేదు. కత్తివేటుకు నెత్తురు చుక్కరాలనంత కళావిహీనంగా ముఖం తెల్లబారిపోయింది. యౌవన లక్ష్మిలా, విరబూసిన వసంతశోభలా కన్పిస్తూన్న నర్సు కళ్లలో కళ్లు కలిపి చూచే ధైర్యం ఆమెకు లేకుండా పోయింది.

ఆ స్థితిలో వున్న అత్తగారికి పాదాభివందనం చేస్తూ నర్సు 'అత్తయ్యా! వారెలా వున్నారు' అని ప్రశ్నించింది తలవంచుకుని.

కోడలిమాట విషలిప్తమైన కత్తివేటులా గుండెను గాయపరుస్తూ వుంటే కోడలిని ఆప్యాయంగా దగ్గరికి తీసుకుని, చెంపలు నిమురుతూ తల్లీ! పసిబిడ్డవు, నీ కెందుకీ బాధ. వాడు క్షేమంగానే వున్నాడు. వోపిక పట్టు అంటూ వోదార్చింది.

అత్తగారి ఆ చివరి మాటతో తనలో బిక్కుబిక్కుమంటూ దాగిన సిగ్గు తన సిగ్గరితనాన్ని విడిచి వువ్వెత్తుగా పొంగి తనను సింగారిస్తూ వుంటే కెంపెక్కిన చెంపలతో తలవంచుకుని -

'అది కాదత్తయ్యా! నిన్నటి రాత్రి వారలా బాధతో వెళ్లిపోయారు కదా? వారి ఆరోగ్యం ఎలా వుందో? తెలియక ఆందోళనపడ్డాను. అంతే! తల్లిలా మీరుండగా నాకేం భయం' అంటూ ముసిముసి నవ్వులు చిలికింది.

కోడలి అమాయికతకు మరింత నొచ్చుకుంటూ ' ఓరి భగవంతుడా! ఈ కుందనపు బొమ్మ బ్రతుకేం కానూ? ఎలా చెప్పను? చెప్పకుండా ఎలా కాపాడనూ?' అంటూ లోలోపల కుములుతూనే పైకి మాత్రం ' ఏదో కొత్తమురిపెంలో మరదళ్లు అతిగా వడ్డించి వుంటారు. అది కాస్త వికారం చేసింది. మందులు వాడుతున్నాడు. నాల్గురోజులు జాగ్రత్తగా వుంటే అదే సర్దుకుంటుంది' అంటూ ఎలాగో సమయస్ఫూర్తితో కోడలిని సమాధాన పరిచింది.

ఇట్లా దినాలూ, వారాలూ, నెలలు గడిచిపోతున్నాయి. ఇంకా ఆలూమగలు ఒకటి కాలేదు. పాపం వేంకటేశ్వర్రాయుడు అస్ఖలిత బ్రహ్మచారిగానే వున్నాడు. గురుమౌఢ్యం అనే మిష ఒకటి వేంకటేశ్వర్రాయుడి బ్రహ్మచర్యానికి బాసటగా నిలిచింది.

ఇంట్లో పనిచేసే వనజాక్షి 'అదేటండి? చిన్నమ్మగారూ! ఎంత మూఢాలున్నా, అయ్యగారు మరీ మడికట్టుక్కూర్చున్నారు. ఏదో వొంటరిగా వున్నప్పుడైనా తమరితో సరససల్లాపా లాడొచ్చుగా? నేను గుమ్మం కాడ కావలికాయనా? ఏంటి?' అంటూ కిలాకిలా నవ్వింది.

దాని మాటలు లక్ష్మీనర్సుకు నిజమే అనిపించాయి. తాను ఎన్నిసార్లు పువ్వులు కోసుకునే నెపంతో యింటి వెనుకవున్న మల్లె పొదల దాపుకు వొంటరిగా వెళ్లలేదు? తోటమధ్యలో వున్న మామిడికి అమర్చిన ఉయ్యాల వూగలేదు? ఒక్కసారి వచ్చి నన్ను వూపవచ్చుగా? నాకు అందని పూలకొమ్మనైనా వంచి అందించవచ్చుగా? ఆ నెపంతో కనీసం ఒక్కసారి తాకవచ్చుగా? మరీ శ్రీరామచంద్రుడిలా సమయపాలనం చేస్తున్నాడు' అంటూ క్రేళ్లురికే కోడె కోరికల ధాటికి తట్టుకోలేక భావతరంగాల్లో సుళ్లు తిరుగుతూ, తిరిగి సమాధాన పడుతూ గడిపింది.

నిజం చెప్పవలసి వస్తే ఈ ఆలూ మగలను దూరంగా వుంచిన కారణం మౌఢ్యం కాదు. అది కేవలం మిషమాత్రమే! నిజమైన కారణం కక్కనూ మింగనూ శక్యంకాని ఆయఃపిండం వంటి రహస్యం. ఆ రహస్యమే బయలైతే? పాపం లక్ష్మీనర్సు సుందర స్వప్నం భగ్నమౌతుంది. ఆమె సౌభాగ్యవల్లరి పాడువారుతుంది. ఆకాశాన్ని చుంబించే మధురోహలకు మసి తాకుతుంది. సర్వం శూన్యమౌతుంది.

ఇంతటి వుపద్రవరూపమైన ఆ రహస్యం ఏమై వుంటుందో? ఈ రహస్యం రహస్యంగా వుంటేనే మంచిది. ఒక వేళ చెప్పుకున్నా గుసగుసలతో చెవీ చెవీ కొరుక్కోవలసిందే కాని నలుగురిలో చెప్పుకోవలసిన మాట కాదు.

ఏమీ లేదు. మన వేంకటేశ్వర్రాయుడికి పురుషత్వ ధర్మలోపం వుందిట.

అయ్యో! అంతటి సొగసు అడవికాసిన వెన్నెలేకదా! ఇంకా ఈ విషయం లక్ష్మీనర్సుకు తెలియదు. గురుమౌఢ్యం పోయింది. నర్సు మనస్సులో వుత్సాహం పురకలు వేస్తూ వుంది. కొన్ని నాళ్లనుండి వేంకటేశ్వర్రాయుడు కూడా నర్సును మగచూపుతో చూస్తున్నాడు. రెండు మూడుసార్లు నర్సు చెంపలపై చుంబించాడు కూడా. పంచబాణుడు సుసజ్జితుడై చెవిదాకా సింగిణీలాగి సిద్ధంగా వున్నాడు, నర్సు వైపునుండి - మందులు బాగానే పనిచేసినట్లున్నాయి.

ఈసారి కార్యానికీ ఏ హడావిడీ చూపలేదు. ఇంటివారే శయ్యా గృహంలో పూలపాన్పు అమర్చారు. జాజికాయ, కస్తూరి, కుంకుమపువ్వు కలిపిన పాలగ్లాసులు వుంచారు. అమ్మాయి అలంకృత అయి కుర్చీలో వొయ్యారంగా కూర్చుని ఏదో, మాగజీను పేజీలు తిప్పుతూవుంది.

అత్తరువాసనల ఘుమఘుమలతో వేంకటేశ్వరాయుడు పడకగదిలో ప్రవేశించాడు. కమ్మటి కస్తూరి పచ్చకప్పురపు వాసనలు గుభాళించే తాంబూలం నమలుతూ వచ్చాడు. వచ్చీరాగనే అత్యంతావేశంతో 'ఓ డియర్! మై లవ్!' అంటూ రెండు చేతులా నర్సును బిగిగా కౌగిలించుకుని గట్టిగా ముద్దులు గుమ్మరించాడు. అమ్మాయి ఆనందంతో వుక్కిరి బిక్కిరైపోతూ వుంది.

గది వెలపల తల్లి పచార్లు చేస్తూనే వుంది. ఓ పది నిమిషాలు ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. హే భగవంతుడా! అంటూ రెండు చేతులెత్తి దండం పెట్టుకుంటూంది.

ఇంతలోకే వేంకటేశ్వర్రాయుడికి వణుకు ప్రారంభమైంది. ముదనష్టపు భయం ముంచుకు వచ్చింది. ఉద్వేగమంతా చప్పు చల్లారిపోగా ఆపాదమస్తకం చెమటల్లో తడుస్తూవుంటే కౌగిటిలో కరుగుతున్న బంగారు బొమ్మను సడలించుకుని 'అమ్మా' అంటూ బయటికొచ్చేశాడు. కార్యంనాటి పెళ్లికొడుకు.

ఆ పిలుపు పరమ అసహ్యమై ఆ తల్లిని ఒక్కసారి కుదిపివేసింది. ఆకాశం విరిగి తలపై కూలినట్లైంది. తన కాళ్లకింది భూమి క్రుంగుతూ తనను పాతాళానికి లాక్కెళ్లుతున్నంత వేదనను ఆమె అనుభవించసాగింది. తన ఎదుట పడిన విగ్రహం కొడుకులా కాక వికృతమైన తన పురాకృత పాపచిహ్నంగా గోచరించసాగింది. కాళ్లీడ్చుకుంటూ అవమానభారంతో తల్లిగదిలోకి వెళ్లి దిండులో ముఖం కప్పుకుని వెక్కివెక్కి ఏడుస్తున్నాడు. వెంకట్రాయుడు.

కొంతసేపటికి తేరుకున్న తల్లి కొడుకు దగ్గరకు వెళ్లి వీపు నిమురుతూ ఆప్యాయంగా 'ఏం నాయనా! మందులు పనిచేయలేదా?' అంటూ ప్రశ్నించింది. సమాధానంగా కొడుకు 'లేదమ్మా! ఇహ లాభం లేదు. నా మూలాన్ని ఆ అమ్మాయి జీవితం వృధా కావడం నా కిష్టంలేదు. ప్రతిసారీ ఏదో ఆశ కల్పించి స్వార్థంతో ఆ నర్సు గొంతు కోయలేను. ఆడుతున్నది మహాకపట నాటకం. ఇక నా వల్లకాదు. ఆ అవమానం భరించలేను' అన్నాడు.

'మరేం జేతం రా? ఎంత అప్రతిష్ఠపాలు? నలుగురికి తెలిస్తే?'

'ఆ( తెలిస్తే తెలుస్తుంది. నిప్పును ఎంతకాలం మూటకడ్తాం? అమ్మాయికి నేను విడాకులిస్తాను. ఎవరో పెళ్లి చేసుకుంటుంది' అని మాట్లాడుతున్న సందర్భంలోనే నర్సు మెల్లిగా అడుగులు వేసుకుంటూ వచ్చి సంభాషణంతా విన్నది.

తల్లీ కొడుకులిద్దరూ హడలెత్తిపోతున్నారు, చివరకు మాటలు పెకల్చుకుని -

' ఏమ్మా! ఇలా వచ్చావ్? వాడికి మళ్లా ఏదో సుస్తీ చేసినట్లుంది. నీవు వెళ్లిపడుకో' అంది. ఆ మాటలు విని లేదండి అత్తగారు, నేనూ ఇక్కడే పడుకుంటాను' అంటూ ప్రసన్నంగా ముఖం పెట్టి నిబ్బరంగా చెప్పింది నర్సు.

'ఇక్కడ వద్దమ్మా! నీ గదిలోకి పద ! మేం ఇద్దరం వస్తాం' అంటూ వెళ్లి ముగ్గురూ ఆ రాత్రి శోభనపు గదిలో జాగారం చేశారు.

తెల్లారింది. నిద్రలేమితో కళ్లెర్రబారి వున్నాయి. అది చూచి అందరూ వుల్లాసంగా నవ్వుకున్నారు. స్నానాలూ, అలంకారాలూ, విందులూ, విడియాలూ అన్నీ రుచిగా పసందుగా జరిగిపోయాయి. అమ్మాయి గలగలా నవ్వుతూ గుప్పెడు మల్లెపూలు తలలో తురుముకుని భర్తకు తమలపాకు చిలకలు చుట్టి యిచ్చింది. ఈ సారి సిగరెట్టు కాలుస్తూ వేంకటేశ్వర్రాయుడు పేపరు చదువుతున్నాడు.

'పెళ్లాం బాగానే మైదు చల్లిందే?' అంటూ అందరూ హాస్యాలాడారు.

మళ్లా సాయంకాలం అత్తగారు జరీ మల్లనింబోళీ చీర కానుక పెట్టి కోడలికి స్వయంగా పూల జడవేసి అలంకరించింది.

పూలజడతో ఘల్లు ఘల్లుమనే పాంజేబులతో పడకటిల్లు ప్రవేశించింది. కానీ ఈ సారి సరసమూలేదు సల్లాపమూ లేదు. చెమటలంతకన్నా లేవు. దయనీయమైన ఆ పరిస్థితిని భరించలేక వేంకటేశ్వర్రాయుడు భార్యతో లాలనగా

'నర్సూ! నన్ను క్షమించు, నేనశక్తుణ్ణి, నేను నీకు సంసారసుఖాన్ని యివ్వలేను, నీవు మరో పెళ్లి చేసుకో' అన్నాడు.

'ఛా, అలా అనడం తప్పు, నాకేం తక్కువ? మీకేంలోటు? పడుకోండి అంటూ హాయిగా నిద్రపోయింది నర్సు.

నర్సు ఆ యింటి వారికి యింకా కొత్త కోడలే! తన ప్రవర్తనతో అందరికీ కన్నాకై మెసలుతూ వుంది. నర్సు పసిపిల్లలా స్వచ్ఛంగా నవ్వుతుంది. ఆ నవ్వుల వెన్నెల్లో మబ్బు మరక ఎక్కడా కనిపించకుండా నర్సు జాగ్రత్త పడింది. ఒక వారం పదిరోజులపాటు అత్తగారు కోడలిని జాగ్రత్తగా కనిపెట్టుకుని పరీక్షగా చూచింది. అయినా నర్సులో అసంతృప్తి చిహ్నాలేవీ కనిపించలేదు. అత్తవారికీ పుట్టింటి వారికి కూడా ఏ మాత్రం తన పరిస్థితిని గూర్చి

చూచాయగా కూడ తెలియనివ్వలేదు. పైగా తానూ అల్లుడు సుఖంగా వున్నామంటూ పుట్టింటికి వుత్తరం వ్రాసింది. అది చూచి యిల్లంతా సంబర పడ్డారు. అందరికన్నా ముఖ్యంగా నాయనమ్మ వుత్తరాన్ని చేతికి తీసుకుని తడుముతూ 'అబ్బో! నా చిట్టి చిలుక అప్పుడే ఎంతదైందో?' అంటూ ఎదనిండిన మమతలకు చిహ్నంగా కన్నీళ్లొత్తుకుంది.

తల్లి ప్రోత్సాహంతో వేంకటేశ్వర్రాయుడు సాధ్యమైనంత వరకు భార్యను సుఖపెట్టాలనే ప్రయత్నం చేస్తున్నాడు. ప్రాణాంతకమైన అవమాన భారాన్ని సహిస్తూ ఏనాటికైనా నర్సుకు సంసార సుఖాన్ని యివ్వగలిగితే చాలు! అంటూ నల్లమందుతో పుటంపెట్టిన బలవర్ధకమైన ఔషధ సేవనం ప్రారంభించాడు.

అత్తగారి చలువతో నర్సుకు ఏలాంటి యిబ్బందీ లేదు. పైగా అలూ మగలు అన్యోన్యంగా వుండేందుకు అనేకావకాశాలు కల్పించింది. కొడుకును వుల్లాసంగా వుంచేందుకూ కోడలిని రంజింపచేసేందుకు, ఆమే స్వయంగా చిన్నచిన్న వేడుకలు కల్పిస్తూ వుంటుంది. ప్రతి రోజూ మధ్యాహ్న భోజనానంతరం అత్తాకోడలు ఒకవైపూ కొడుకు తండ్రీ రెండోవైపుగా చేరి, పచ్చీసు, పులికట్ట, అట్టచెమ్మ ఆటలు ఆడుకుంటారు. కోడలి జాణతనంతో ఎప్పుడూ అత్త పక్షమే గెలుస్తుంది.

అది చూచి మామగారు కూడా 'మీయమ్మ గయ్యాళిరా, ఆ తర్ఫీదులో కోడల్ని కూడా గడుసరిగా మారుస్తుందేమో? భద్రం రా' అంటూ తనవంతు వుత్సాహాన్ని పంచుతుంటారు. ఇలా ఆ ఇంట్లో అందరూ ఆనందంగా నవ్వుకుంటూ వుంటే ఆ యిల్లు మల్లెపందిరిలా జలజలా పువ్వులు వర్షిస్తూ వుంది.

ప్రతి నిత్యం భార్యాభర్తలిద్దరు ఏకాంతంగా యింటి వెనకవైపు వెళ్లుతారు. తోటలో తిరుగుతారు. నర్సు చెట్లకు నీళ్లుపోస్తుంది. వెంకటేశ్వర్రాయుడు ఉయ్యాలపై కూర్చుంటాడు. నర్సు పరుగెత్తుతూ వచ్చి కళ్లుమూస్తుంది. రాయుడు చిరుచెమటలు పోస్తాడు. కమ్మటి వాసనలు వెదజల్లే పద్మం చుట్టు చేరిన తుమ్మెదల్లా చెమట తడిసిన ముఖం మీద వుంగరాలు తిరిగిన ముంగురులు వాలుతూవుంటే సాక్షాత్కరించిన అనంగ విలాసంలా పరుగులు వారుతూ రివ్వుమంటూ బంతిని రాయుడివైపు విసురుతుంది. విధిలేక రాయుడు మళ్లా నర్సు వైపు వేస్తాడు. పంచకళ్యాణిలా, పంచసాయకుని బాణంలా, పారే సెలయేరులా వాడీవేడీ వొయ్యారాలను జోడించి సయ్యాటలాడుతున్న భార్యను చూస్తూ అనుభవించనూ, త్యజించనూ శక్తి చాలక లేని వుత్సాహాన్ని పుంజుకుని కనుగొలుకుల నీళ్లతో కేవలం భార్య తృప్తికోసం వెంకటేశ్వర్రాయుడు ఆ యీ క్రీడల్లో పాలు పంచుకుంటూ వుల్లాసంగా కనిపిస్తాడు.

ఇట్లా అందరి తలలో నాలుకగా మారి కిలకిలా నవ్వుతూ అయింటి ఎదలో రాజుకున్న కుంపటిని చల్లార్చి భవిష్యత్తుకు దివిటీ వెలిగించింది నర్సు. నిజానికి నర్సు లోలోపల కుమ్మరావంలా కాలిపోతూనే వుంది. సుఖలాలసతో జీవించాలనే కోరికకు మంగళం పాడింది. కానీ తన కల భగ్నమై తాను విధి వంచిత ఐ దీనంగా నిష్క్రమించడం కానీ,

సంసారిక సుఖాన్ని కాంక్షించి ఇరు కుటుంబాలకు యిబ్బంది కలిగిస్తూ మరో వ్యక్తిని భర్త అంటూ ఆశ్రయించడం కానీ నచ్చలేదు.

తానెన్ని కలలు కన్నది? తన భాగ్య విశేషాన్ని అందరూ పొగడ్తూ వుంటే అభాగ్యాలన్నిటినీ అతిక్రమించిన సొగసుకాడు తనవాడై పక్కన నిల్చిననాడు ఎంత పొంగిపోయింది. ఎన్ని చిలిపి కోరికల తరంగాలు? ఎన్నెన్ని దొంతరల వూహలు? అవన్నీ పిడకలకుచ్చెనలా కూలిపోగా తానొక విషాద దేవతలా, పాడుబారిన యౌవన శోభతో ఒకరి దయకు పాత్రమై జీవికను సాగించడంకన్నా దౌర్భాగ్యస్థితి వేరొకటి లేదు. అంటూ అలోచించింది. అందరినీ మభ్యపెడ్తూ తాను లేని సంతోషాన్ని కల్పించుకుని ఆ వూహాకల్పిత శృంగారకాసారంలో రాజహంసలా సంచరిస్తూ కాలంగడుపుతూంది నర్సు.

చిటపటలు కానీ, ఉస్సురస్సురుమంటూ వేడినిట్టూర్పులు కానీ మాడ్పుముఖంకానీ లేకండా ఎందరు పరిచారికలున్నా స్వయంగా నర్సు భర్తకు సకల పరిచర్యలు నవ్వుతూ తుళ్లుతూ చేస్తుంది. ఇదంతా చూస్తున్న అత్తగారి దృష్టికి నర్సు కాలి భగ్గుభగ్గున మండిపోతూ యిల్లంతా వెలుగు నింపేదీపంలా కన్పిస్తూంది. పాపం అత్తగారు మాత్రం ఏం చేస్తుంది? ఏదో పాపం! అమ్మాయి ఎలాగో జీవితంతో రాజీపడింది. అయినా, ఇది సామాన్యురాలు కాదు. సావిత్రి, అరుంధతి, సుమనల వంటి పతివ్రతల కోవకు చెందింది. అంటూ అత్తగారూ, 'ఎంత అన్యోన్యమైన జంట!' అంటూ ఇరుగు పొరుగూ విచిత్రంగా చెప్పుకోసాగారు.

ఆభాసరూపమైన ఈ కపట నాటకంతో నర్సు బాగా అలసిపోయింది. తనకు తెలియకుండానే తనలో ఏదో నిరీహ, నిర్లిప్తతలు చోటుచేసుకుంటున్నాయి. అద్దంలో తనరూపం చూసుకున్నప్పుడల్లా ''నినందరూపం హృదయేన సా పార్వతీ'' అనే మాటలు తనకెందుకో స్మృతి పథంలో మెదుల్తూ ప్రియలాలనా సౌభాగ్యానికి నోచుకోని ఈ సౌందర్యంతో నాకు పనేమి? అంటూ వో లిప్తకాలం వుదాసీనంగా ఆలోచిస్తుంది. వెంటనే 'ఛీ! నేనెంత తప్పుగా ఆలోచిస్తున్నాను. నవమన్మథుడులాంటి భర్త సజీవుడై, నా సాన్నిధ్యంలో నా సాహచర్యంలో మెలుగుతుండగా నెనిలా భావించడం ఏం బాగుంది? అంటూ సర్దుకుని తన్నుతాను మరింత శృంగారంగా అలంకరించుకుని ఏ చిలిపిగాలులు చొరకుండా తన హృదయ కవాటాన్ని గట్టిగా బంధించి, విధి నిర్వహణకు బయలు దేరుతుంది.

ఇట్లా నర్సు గదిలో ప్రవేశించే వరకు వేంకటేశ్వరరాయుడు వుబ్బిన కళ్లతో, ఎర్రబారిన ముఖంతో రుద్ధమైన కంఠంతో శ్రీకృష్ణుని పటం ముందు నిల్చుని 'ప్రభూ! నాకీ కొరమాలిన జీవితంతో పనేముంది? చిగిర్చిన గున్నమావిలా, పుష్పించిన కడిమిలా, యౌవనశోభతో వున్న ఆ నర్సు జీవితాన్ని నేను బూదిపాలు చేస్తున్నాను. ఆమె మేలుకోరి నిస్వార్థంగా సడికోర్చి అయినా విడాకులిస్తానంటే ఆ సాంప్రదాయిక కుటుంబిని, ప్రణయమూర్తి, నా మాట సాగనివ్వడం లేదు. బహుశః నేను బ్రతికుండగా నర్సుకు ఈ చెర తప్పదేమో? అందుకే ప్రభూ! ఈ జీవితాన్ని అంతం చేసుకో దలచాను. ఆత్మహత్యా పాపం నాకు తగులకుండా కాపాడు. వచ్చే జన్మలో నన్ను వీర్యవంతుడైన వుత్తమ పురుషుడిగా పుట్టింపజేసి నర్సునే నాకు భార్యగా అనుగ్రహించు. ఆమె అహానికి ఎక్కడా దెబ్బ తగులనివ్వకు' అంటున్నాడు.

ఈ మాటలు వింటున్న నర్సు కొంత వడి మ్రాన్పడి, వెంటనే ఏ అఘాయిత్యం తలపెడ్తారో? అంటూ ' ఏవండీ! ఈ గదిలో మీరొక్కరే వున్నారా? నాకూ ఏం తోచడం లేదు, రండి కబుర్లు చెప్పుకుందాం అంటూ విరబూసిన పారిజాతం గుప్పున గంపెడు పూలు రాల్చినట్లు గలగలా! ఆప్యాయతలు వర్షించింది.

'అబ్బ ఆగు నర్సు,నా కంట్లో ఏదో పడింది. ఆ నలుసు తొలగించడానికి ప్రయత్నిస్తున్నాను. ఇప్పుడే ముఖం కడుక్కొని వస్తాను. 'అమ్మ ! ఏం పిల్లరా బాబు, పటాకీ రకం అంటూ తన బాధ కనపడనీయకండా దాక్షిణ్యాన్ని ప్రదర్శించాడు.

ఆమాటు విన్న నర్సుకు దుఃఖం పొంగుకువచ్చింది. కేవలం సుందరరూపమే కాదు సున్నితమైన హృదయం కూడా వున్నవాడు ఇంతటి వాడికి ఈ లొచ్చు కల్పించి ఆయనతో పాటు నా బ్రతకూ బండపాలు చేశావా విధీ' అంటూ అక్కడినుండి మెల్లిగా వెళ్లిపోయింది. అత్తగారు పిలుస్తున్నారన్న నెపంతో.

ఒక వారం పాటు నర్సు పరిపరివిధాలా ఆలోచించింది. ఔగాముల బేరీజు వేసుకుంది. తన నిర్ణయాలను గొప్ప గణిత శాస్త్రవేత్తలా పర్మిటేషన్స్,కాంబినేషన్స్ రీత్యా జోడిస్తూ ఫలితాలను అంచనా వేసుకున్నది. చివరకు అడవిగాసిన వెన్నెల్లాంటి తన జీవితానికి వో ప్రయోజనమంటూ లేదని గ్రహించింది. అంతేకాదు, యీ మాత్రం సౌభాగ్యమన్నా దక్కనీయకుండా వేంకటేశ్వర్రాయుడు తన కన్ను మరిగించి ఎప్పుడో పుట్టి ముంచేట్లున్నాడు. అప్పుడు తాను విధవగా జీవించాలి. పోనీ ఆ తరువాత ప్రాణత్యాగం చేసినా లాభం ఏముంటుంది? వైధవ్యం అనే మచ్చ తప్పదుగా?

'ఛీ! ఛీ! ఎంత మాట అనుకున్నాను., ఆ మాట తలపెట్టడంతోటే తన వొళ్లంతా జలదరించింది. సౌభాగ్యాన్ని తుడుచుకొని జీవించే కన్న మరణమే సుఖం. అందుకే యీ రెండు కుటుంబాల వంశగౌరవానికి ఏలాఘవమూ కల్పించకుండా, తన సౌభాగ్యానికి వన్నెతరగకండా త్వరలోనే తనను తాను రూపుమాపుకోవాలి' అంటూ చివరి నిర్ణయం తీసుకుంది.

ఈ నిర్ణయం తరువాత నర్సు నలతగా కన్పిస్తూంది. విధినిర్వహణలో, తన అలంకరణలో అంత శ్రద్ధ చూపడంలేదు. జంత్రపుబొమ్మలా మొక్కుబడి కోసం పనులేవో నిర్వహిస్తున్నట్లు కనిపిస్తూంది. ఒకటి రెండు సార్లు అన్నం సహించడం లేదంటూ భోజనానికి కూర్చోలేదు. ఓ వారం పదిరోజులనుండి నర్సులో యీ మార్పులను చూసిన పరిచారకజనం ముసిముసి నవ్వులతో 'చిన్న దొరసానికి నెలతప్పిన చిన్నెలు కన్పిస్తున్నాయ్. ఈసారి మాకు వొడినిండా కానుకలే' అంటూ ఖుషామత్ చేస్తే నర్సు 'పోండే! మీకడ్ప్రాత్రం పాడుగాను'' అంటూ కళ్లకు కొంగు అడ్డం పెట్టుకుని వచ్చే దుఃఖాన్నీ వ్యధను సిగ్గురూరపంలో మరుగు పరిచింది.

అలావాటు ప్రకారం ఆనాడు కూడా భార్యభర్తలిద్దరూ యింటి వెనకభాగం తోటలో ప్రవేశించారు. నర్సు విన్నదనాన్ని చూచి వెంకటేశ్వర్రాయుడు, ఆమెలో వుత్సాహాన్ని ప్రోది చేసేందుకు తానే మొదట బంతి విసిరాడు. ఆ బంతి నర్సును తప్పించుకుని శరవేగంతో దూసుకు వెళ్లింది. ఆ బంతి వెంట నర్సు పరుగు మొదలు పెట్టింది.

పరుగెత్తుతున్న నర్సు కళ్లకు చీకట్లు కమ్ముతున్నాయి. కాళ్లు సరిగా భూమిపై ఆనడం లేదు. ఏదో గాలిలో తేలిపోతున్నట్లు ముందుకు సాగుతూ వో పెద్ద బండరాయికి తట్టుకొని 'అమ్మా!' అంటూ పడిపోయింది. కడుపులో పేగులను సుళ్లు తిప్పే ఆ ధ్వని విన్న వేంకటేశ్వర్రాయుడు పరుగెత్తుకు వచ్చి నర్సును రెండు చేతులా లేవనెత్తి పడకగది చేర్చి మంచం మీద పడుకోబెట్టాడు. నల్గురూ నాల్గువైపుల డాక్టర్ కోసం పరుగెత్తారు. క్షణాల్లో గది అంతా బిలబిలమంటూ చేరిన కుటుంబీకులతో నిండిపోయింది. ఆహాకారాలు వ్యాప్తిస్తున్నాయి.

ఇంతలోకే స్పృహ వచ్చినట్లు నర్సు కళ్లు తెరిచి గది నలువైపులా తేరి చూచింది చివరకు తన ప్రక్కనే కూర్చుండి రోదిస్తున్న భర్త ముఖంపై దృష్టిని కేంద్రీకరించింది. ఆ చూపులను తట్టుకోలేని వేంటేశ్వర్రాయుడు 'నర్సూ నన్ను క్షమించుమంటూ ఆమెను గుండెలకు హత్తుకుంటూ పెదవులు చుంబిస్తున్నాడు. లీలగా నర్సు కళ్లలో, పెదాల మీద సుఖరేఖ మెరిసింది. ఆమె కళ్లు మూతలు పడ్డాయి. ప్రాణాలు పంచభూతాల్లో కలిసిపోగా నిర్జీవమైన కట్టె మాత్రం వేంకటేశ్వర్రాయుడి కౌగిలిలో మిగిలింది.

ఇంతలోడాక్టరు వచ్చాడు. పరీక్షగా చూచి పెదవి విరిచాడు. 'అయినా గాయం పెద్దదిగా లేదు. రక్తం కూడా ఎక్కువగా స్రవించలేదు. ప్రాణాంతకమైన దెబ్బలెక్కడా కనిపించడంలేదు. మరి ప్రాణం ఎలా పోయిందో? బలమైన గాయం ఏదో లోపల తగిలి వుంటుంది' అంటూ డాక్టరు వెళ్లిపోయాడు.

పుట్టుకతో, వివాహంతో, చావుతో కూడా నర్సు అదృష్టజాతకురాలు ఎంత అదృష్టవంతురాలు కాకపోతే యిలా పసుపుకుంకుమలతో నిత్య సౌభాగ్యవతిగా జీవితం చాలిస్తుంది. పైగా భర్త చేతుల్లో, ఆయన కౌగిలిలో పోయింది. ఎంత పుణ్యాత్మురాలు అంటూ జనమంతా సన్మానిస్తూ వుంటే పుట్టినింటివాళ్లు మెట్టినింటివాళ్లు 'మా నర్సు చిన్నతనంలోనే పెద్దల్లో కలిసి, మూలదొంతిగా పెద్ద ముత్తైదువుగా. నిల్చి సౌభాగ్యవతి పూజలందుకుంటుంది. అన్నారు.

'ఏం సౌభాగ్యం? ఎంత అదృష్టవంతురాలు నర్సు' అంటూ హారతులెత్తింది వూరూవాడ.